
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 18 మే 2025





సండే స్పెషల్

రంగస్థలంపై యువ ఇంజనీర్లు!

పద్యనాటకాలకు ఊపిరిలూదుతూ సరికొత్త పాత్ర పోషణ

- తెలుగు సంస్కృతి మూలాల విశిష్టతను చాటుతున్న కళాకారులు
- వృత్తిలో రాణిస్తూ.. ప్రవృత్తికి ప్రాణం పోస్తూ.. ముందుకు

వృత్తిలో రాణిస్తూ.. ప్రవృత్తి(కళారంగం)కి ప్రాణం పోస్తూ ముందుకు సాగుతున్నారు పలువురు యువ ఇంజనీర్లు. మరుగున పడుతున్న పద్య నాటకాలకు ఊపిరిలూదుతూ తెలుగు సంస్కృతి మూలాల విశిష్టతను భావితరాలకు చాటి చెబుతున్నారు. నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు మన జొన్నలగడ్డ శ్రవణ్‌కుమార్, పి.సాయిసౌమ్య, చింతా డూండీ కృష్ణ.

చింతా డూండీ కృష్ణ

6

నైపుణ్యంతోనే శిఖరాగ్రం

- స్కిల్ డెవలప్‌మెంట్‌తో యువతకు ఉపాధి
- ఐటీఐ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్
- 1644 సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
- నైపుణ్య శిక్షణ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు

8

బంగారం మాయ!

హోల్‌సేల్ పేరుతో కస్టమర్లకు ఎర

జీఎస్టీ, తక్కువ తరుగు అంటూ అమ్మకాలు

- రంగు రాళ్లు, బంగారం కలిపి బరువు లెక్కిస్తూ ధర వసూలు
- బ్యాంకులో రుణం కోసం ఓ మహిళ వెళ్లే బయటపడ్డ అసలు విషయం
- పోలీసులను ఆశ్రయిస్తే.. రాజీకి వచ్చిన వ్యాపారి!



వన్‌టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): బంగారం అమ్మకాల్లో వ్యాపారులు రకరకాల లెక్కలు చెప్పి ఆభరణాలకు ధరలు నిర్ణయిస్తుంటారు. వీటి హేతబద్ధత గురించి సరైన వివరాలు మాత్రం ఉండవు. కార్పొరేట్ షోరూమ్‌ల్లో బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తే తరుగు, మజూరి, జీఎస్టీ పేరుతో కొంత అదనంగా చెల్లించవలసి వస్తుంది. ఈ క్రమంలో విజయవాడ హోల్‌సేల్ మార్కెట్‌లో కొత్త దందా నడుస్తోంది. బంగారు ఆభరణాల విక్రయాల్లో విజయవాడ, వన్‌టౌన్, గవర్నర్‌పేట మార్కెట్‌లో తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా గవర్నర్‌పేట జైహింద్ మార్కెట్‌లోని బంగారు దుకాణాలలో బంగారు ఆభరణాలు అత్యధికంగా విక్రయిస్తుంటారు. షోరూమ్‌లలో ఉండే మిగతా 6లో..

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

బంగారు ఆభరణాల తయారీలో తరుగు 18 శాతం వరకు ఉంటుందని, మేకింగ్ చార్జీలు, డిజైనింగ్ చార్జీలు, జీఎస్టీతో పాటు రాళ్ల బరువు క్యారెట్లలో లెక్కించిన తాము హోల్‌సేల్‌గా విక్రయించిన ధర కంటే ఎక్కువే అవుతుందని దుకాణదారుడు బాధితురాలిని నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆభరణాలలో రాళ్ల బరువును విడిగా లెక్కిస్తారని, సాధారణ రంగురాళ్లకు బరువుతో సమానంగా ధర వసూలు చేయరని ప్రముఖ వ్యాపారస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు నిరాకరించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

పూడికతీత లేనట్టే..!


కాలువల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపునకే అనుమతి

పంట కాలువల నిర్వహణ అంచనా వ్యయంలో కోత విధించడం ద్వారా ఈ ఏడాది పూడికతీత పనులు లేనట్టేనని తెలుస్తోంది. తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు వెంటనే చేపట్టాలని సాగునీటి సంఘాలకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. అరకొర నిధులతో ఇప్పుడే పనులు చేపట్టలేమని, కొంతకాలం వేచి చూద్దామన్న ఆలోచనలో అధ్యక్షులు ఉన్నారు. దీంతో ఈ ఏడాది పనులు ఆలస్యం కానున్నాయి. కాగా, కాలువల పూడిక తీత, గట్లు పటిష్టం చేయడం, అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల మరమ్మతుల ఊసేలేకపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

6

పనులు చేయాలని సాగు నీటి సంఘాలకు మౌఖిక ఆదేశాలు

- కొంతకాలం వేచిచూసి పనులు చేస్తామంటున్న అధ్యక్షులు
- మచిలీపట్నం మండలంలో సిమెంట్ లైనింగ్ పనులకు అంచనాలు!
- అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల మరమ్మతుల ఊసేలేదు!
- ఆలస్యంకానున్న పనులు... అయోమయంలో అన్నదాతలు



గుర్రపుడెక్కతో నిండిన శివగంగా డ్రెయినేజీ

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాలోని పంట కాలువల్లో గత ఫిబ్రవరిలో 722 నిర్వహణ పనులకు రూ.32 కోట్లతో అంచనాలు రూపొందించారు. నిధుల కొరత పేరుతో ఈ పనుల అంచనాల్లో భారీగా కోత పెట్టారు. ఒక నియోజకవర్గానికి రూ.3కోట్ల చొప్పున రూ.21 కోట్లు ఇచ్చి సరిపెట్టారు. గతేడాది కాలువల నిర్వహణ పనులకు రూ.26 కోట్లను కేటాయించారు. ఈ ఏడాది నిధుల్లో కోత పెట్టడంతో పంట కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డులేకుండా, భారీ వర్షాలు కురిసిన సమయంలో డ్రెయినేజీలు పొంగిపొర్లకుండా ఎంతమేర పనులు చేస్తారనే అంశంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. కేటాయించిన కొద్దిపాటి నిధులతో కేవలం కాలువల్లోని తూటుకాడ, గుర్రపు డెక్కలను తొలగించాలని నిర్ణయించారు. మేలో డ్రెయినేజీల్లో కత్తెర పోట్లు కారణంగా ఉప్పునీరు చొచ్చుకు వచ్చే ప్రాంతం వరకు తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులను మినహాయించారు. ఉప్పునీరు ప్రవేశించని ప్రాంతాల్లో తూడు, గుర్రపుడెక్కలను నిర్మూలించేందుకు రసాయనాలు పిచికారీ చేయాలని భావిస్తున్నారు.

మట్టి పనులకు నిధుల్లేవ్!

ఈ ఏడాది పంట కాలువలు, డ్రెయినేజీల్లో నిధుల కొరత కారణంగా మెరక వేసిన ప్రాంతాల్లో పూడికతీత, గట్లు బలహీనంగా మారినచోట్ల గట్లు బలోపేతం వంటి మట్టి పనులు చేయడానికి అవకాశం ఇవ్వలేదని, నిధులు కూడా కేటాయించలేదని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నీటిపారుదలశాఖ అధికారులు ఆయా సాగునీటిసంఘాల పరిధిలోకి వచ్చే పంట కాలువలు, డ్రెయినేజీల్లో తూడు, గుర్రపు డెక్క తొలగించేందుకు ఎంత మేర నిధులు విడుదలయ్యాయి, ఎంతమేర పనులు చేయాలనే అంశంపై సాగు నీటి సంఘాల అధ్యక్షులకు తెలియజేశారు. మట్టి పనులు చేయడానికి నిధులు విడుదల కాలేదని తేల్చిచెప్పారు. కాలువల నిర్వహణ పనులకు ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరలో వస్తాయని, ఈలోగా అత్యవసరమైన ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తూడు, గుర్రపు డెక్కల నిర్మూలన పనులు ప్రారంభించాలని సాగు నీటి సంఘాల అధ్యక్షులకు నీటి పారుదలశాఖ అధికారులు సూచించారు. కొంతకాలం వేచిచూసి పనులు చేస్తామని అధ్యక్షులు చెబుతున్నారు.

సిమెంట్ లైనింగ్ పనులకు ఆమోదం లభించేనా!

దివిసీమకు సాగు నీరందించే కేఈబీ కాలువకు(కరువు కాలువ) అనుబంధంగా ఉన్న 9/7వ నెంబరు బ్రాంచి కాలువకు డెల్టా ఆధునికీకరణలో భాగంగా 2011లో సిమెంటు లైనింగ్ పనులు చేశారు. కాలువ ప్రారంభమయ్యే పెదయాదర గ్రామం వద్ద, కాలువ చివర కోనగ్రామం వద్ద కొంత మేర కాంక్రీటుతో లైనింగ్ పనులు చేశారు. తుమ్మలచెరువు సమీపంలో కాంక్రీటు పనులు చేయలేదు. దీంతో కాలువ ద్వారా కోన గ్రామంలోని పొలాలకు సాగు నీరు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. ఈ కాలువకు పూర్తిస్థాయిలో సిమెంట్ లైనింగ్ పనులు లేదా కాలువ గట్లకు రెండు వైపులా లోపలి అంచులకు సిమెంటు పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

జైకా నిధులతో అయినా పనులు చేస్తారా!

పంట కాలువలు, ప్రధాన డ్రెయినేజీల్లో పూడి కతీత పనులకు అరకొరగా నిధులు కేటాయించడంతో ఈ ఏడాది పూడికతీత పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో జిల్లాలోని పంట కాలువలు, డ్రెయినేజీలకు మరమ్మతు పనులు చేయాలనే ప్రతిపాదన ఇటీవల తెరపైకి వచ్చింది. కాలువ గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో గట్లు బలోపేతం, పంట కాలువలు, డ్రెయినేజీలపై పాడైన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణ పనులను జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) నిధులతో చేయాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ఒక్కో సాగు నీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీకి కనీసంగా రూ.20 లక్షలను కేటాయించాలనే ప్రతిపాదన ఉంది. జైకా నిధులను మిగతా 6లో..



గుడివాడలో భారీ వర్షం

మచిలీపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి) : ఉదయం నుంచి సెగలు పుట్టించిన ఆకాశం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. గుడివాడలో రాత్రి 7.30 గంటల నుంచి గంట పాటు భారీవర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెనమలూరులో చిరుజల్లులు కురిశాయి. ఉయ్యూరులో బలమైన గాలులు వీయడంతోపాటు తేలికపాటి వర్షం కురిసింది. రానున్న 2 రోజుల పాటు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, గంటకు 30నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది.

ప్రాణం తీసిన అరెస్టు భయం



రొయ్యూరు - మద్దూరు లంకలో పేకాట శిబిరం

దాడి చేసిన తోట్లవల్లూరు పోలీసులు

- కృష్ణానదీపాయలోకి పరారవుతూ నీటిమడుగులో దూకిన ఇద్దరు
- మునిగిపోయి ఒకరు మృతి.. మరొకరు క్షేమం
- పోలీస్ స్టేషన్ వద్ద బంధువుల ఆందోళన



ఘటనాస్థలంలో వల్లభనేని గోపాలం మృతదేహం.. ఇన్‌సెట్‌లో గోపాలం(ఫైల్)

తోట్లవల్లూరు/కంకిపాడు, మే 17: రొయ్యూరు కృష్ణానది ఒడ్డున పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేయటంతో అరెస్టు చేస్తారనే భయంతో ఓ వ్యక్తి పారిపోయే క్రమంలో నదీపాయలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం... రొయ్యూరు - మద్దూరు లంకలో ఓ పది మంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న తోట్లవల్లూరు ఎస్సై సీహెచ్.అవినాష్ తన సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేశారు. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు, కంకిపాడు మండలం మద్దూరు గ్రామాలకు చెందిన పదిమంది పేకాట ఆడుతున్నారు. వారు పోలీసులను చూసి పరారయ్యారు. కంకిపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన వల్లభనేని గోపాలం అలియాస్ గోపి(30), వడుగు వెంకటేశ్వరరావు పేకాట శిబిరం నుంచి కృష్ణానదీపాయలోకి పరారవుతూ నీటి మడుగులోకి దూకారు. గోపాలం నీటిలో మునిగిపోయాడు. మరోవ్యక్తి వెంకటేశ్వరరావు ప్రాణాలతో బయటకు వచ్చాడు. గోపాలం నీటిలో మునిగిపోవటంతో ఘటనా స్థలం నుంచి పోలీసులు వచ్చేశారు. ఆ తర్వాత బంధువులు వచ్చి గోపాలం మృతదేహాన్ని బయటకు తీశారు. మద్దూరు నుంచి గోపాలం బంధువులు తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సైను కలిసి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గోపాలానికి భార్య, ఇద్దరు చిన్నారులు సంతానం. వారికి తగిన న్యాయం చేయాలని రాత్రి పొద్దుపోయే వరకు బంధువులు స్టేషన్ వద్దే ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

8

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



అవినీతి కంపు!

కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ నిర్వాకం!

- మంజూరైన పోస్టులు 150.. పనిచేస్తున్నది 511 మంది
- లీడ్ మేస్త్రీల పేరుతో ఆర్డర్ లేకుండా 154 మంది నియామకం
- సిఫార్సులతో అదనంగా మరో 41 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- సచివాలయ శానిటరీ కార్యదర్శులకు జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా విధులు
- కాసుల వేటలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు!
- ప్రజారోగ్యశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు



'మంది ఎక్కువైతే.. మజ్జిగ పలచన' అన్నట్టుగా తయారైంది కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ పరిస్థితి. సిఫార్సులు, డిప్యుటేషన్లు, రికమండేషన్లతో ప్రజారోగ్యశాఖ పరిధిలో తిష్ట వేస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఏ స్థాయిలో అంటే.. మంజూరు చేసిన పోస్టుల సంఖ్య కంటే కూడా అదనంగా ఉంటున్నారు. పోనీ, ఆ స్థాయిలో అయినా ప్రజారోగ్యశాఖ పనితీరు మెరుగు పడిందా అంటే మరింత తీసికట్టుగా మారిపోయింది. విచ్చల విడి అవినీతి, దోపిడీలకు అడ్డాగా తయారైంది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజారోగ్య విభాగంలో ఒక ప్రధాన ఆరోగ్య అధికారి (సీఎంవోహెచ్), ఇద్దరు సహాయ ఆరోగ్య అధికారులు (ఏఎంవోహెచ్‌లు), శానిటరీ సూపర్ వైజర్లు ఆరుగురు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 32 మంది, హెల్త్ అసిస్టెంట్స్-24 మంది, శానిటరీ మేస్త్రీలు 85 మంది పోస్టులు శాంక్షన్‌గా ఉన్నాయి. మొత్తంగా ఈ పోస్టుల్లో 150 మంది సిబ్బంది ఉండాల్సి ఉంటే ప్రస్తుతం 511 మంది పనిచేస్తున్నారు. సుమారు మూడు రెట్లు అదనంగా ఉన్నారు. శానిటరీ మేస్త్రీలు 88 మంది, సచివాలయ కార్యదర్శులు 260 మంది, లీడ్ మేస్త్రీలు 154 మంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 73 మంది చొప్పున పనిచేస్తున్నారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజారోగ్యశాఖలోకి వీరంతా ఎలా వచ్చారో చూస్తే.. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో శానిటరీ కార్యదర్శులను నియమించటం జరిగింది. వీరిని వార్డు సచివాలయాల కోసం నియమిస్తే.. కార్పొరేషన్ అధికారులు వీరిని ప్రజారోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పనులు చేసే విధంగా వాడుకుంటున్నారు. ఒకరకంగా వారి జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా ఉపయోగిస్తున్నారు. వీరంతా కూడా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు. ఒక్కసారిగా 260 మంది వచ్చారనుకుంటే.. ఆ తర్వాత కాలంలో లీడ్ మేస్త్రీల పేరుతో మరో 154 మందిని తీసుకున్నారు. దీనికి ఒక ఆర్డర్ కూడా లేదు. శానిటరీ కార్యదర్శులను పోనీ వారి జాబ్ చార్ట్ ప్రకారం వారిని వార్డు సచివాలయాలలో పనిచేయమని నిర్దేశించారంటే అదీ లేదు.

వసూలు రాజాలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు!

కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అవినీతిమయమైపోయిందని విమర్శలు వస్తున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కాసుల వేటలో పడి ప్రజల ప్రాణాలను కూడా పణంగా పెట్టే పనులు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. భవానీపురంలో ఓ ప్రైవేటు ఎగ్జిబిషన్ నిర్వాహకుల దగ్గర దండిగా డబ్బులు తీసుకున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఎగ్జిబిషన్ నిర్వహణకు ఎన్‌వోసీ తప్పనిసరి. కానీ ఎన్‌వోసీ ఇవ్వకుండా డబ్బులు తీసుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వదిలేశారు. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో ఎవరూ చనిపోలేదు కాబట్టి సరిపోయింది. అదే ప్రజలు చనిపోయి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారు. ఎన్‌వోసీల పేరుతో అడ్డగోలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు క్షేత్ర స్థాయిలో మేస్త్రీలు మామూళ్లు వసూలు చేసి ఇవ్వాలి. పారిశుధ్య కార్మికుల నుంచి నెలవారీ వాటాలు రావాల్సిందే. లేకపోతే వారికి మస్తర్లు ఉండవు. పర్మినెంట్ కార్మికులు పనిచేయకపోయినా వారికి మస్తర్లు మిగతా 6లో..

పైరవీలతో వచ్చేశారు..

లీడ్ మేస్త్రీల పేరుతో రాజకీయ సిఫార్సులు, రికమండేషన్లు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు సూచించిన వారందరికీ ఎడాపెడా ఇచ్చేశారు. కనీస అర్హతలు లేని వారినే ఎక్కువగా లీడ్ మేస్త్రీలుగా తీసుకున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా మరో 41 మందిని అదనంగా తీసుకున్నారు. నగరంలో ప్రతి 40 వేల జనాభాకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉండాలన్నది మునిసిపల్ చట్టం చెబుతోంది. విజయవాడ నగర జనాభా 13 లక్షలుగా ఉంది. ఈ లెక్కన చూస్తే.. మంజూరు చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నగరావసరాలకు సరిపోతారు. కానీ అదనంగా 15 లక్షల జనాభాకు అనుగుణంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించుకోవటం గమనార్హం. క్షేత్ర స్థాయిలో శానిటరీ మేస్త్రీలు కూడా 85 మంది ఉంటే సరిపోతుంది. శానిటేషన్, మలేరియా, నైట్ శానిటేషన్, సిల్ట్, జక్కంపూడి, పాతపాడులలో వీరంతా సరిపోను పనిచేస్తున్నారు. లీడ్ వర్కర్ల పేరుతో అదనంగా నియమించుకోవాల్సిన అవసరం లేదు. ఇంత భారీ సంఖ్యలో ఉన్న శానిటేషన్ సిబ్బంది కారణంగా పని తీరు అయినా మెరుగుపడిందనుకుంటే అత్యంత దారుణంగా తయారైంది.

బియ్యం దొంగ పేర్ని నాని

- మంత్రి కొల్లు రవీంద్రపై అసత్య ప్రచారాలు మానుకోవాలి
- త్వరలో ఆయన జాతకమంతా బయటకొస్తుంది
- టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి పేర్ని నానీ..బియ్యం దొంగ. త్వరలో ఆయన జాతకాన్ని బయటపెడతాం. మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి పక్కన బెల్టుషాపు ఉందంటూ ఆయనపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారు. అసత్యప్రచారం మానుకోవాలి'. అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ హితవు పలికారు. శనివారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నానీతో కలిసి గోపీచంద్ మాట్లాడారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు పేర్ని నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, ధర్మారెడ్డి మాటలు వినేవారన్నారు. అయినా వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పేర్ని నానీ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బందరు పోర్టు నిర్మించకపోతే రాజకీయాల నుంచి విరమించుకుంటానని చెప్పి మాట తప్పారన్నారు. ఏదో ఒకటి మాట్లాడితే గానీ మీడియాలో గుర్తింపు ఉండదని భావించి కొల్లు రవీంద్రపైన అసత్యాల బురద చల్లుతున్నారన్నారు. వైసీపీ హయాంలో గంజాయి, నాటుసారా విస్తృతంగా అమ్మకాలు జరిగాయని, కొల్లు రవీంద్రను విమర్శించే నైతిక హక్కు పేర్ని నానీకి లేదని కుంచే నాని అన్నారు. మచిలీపట్నాన్ని మంత్రి అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఓర్వలేక పేర్ని నానీ మతిస్థిమితం కోల్పోయారని, ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, కొల్లు రవీంద్రపై చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలని టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు ఖాజా, రత్నాకర్, గోకుల శివ, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, దేవరపల్లి అనిత డిమాండ్ చేశారు.

పేదల బియ్యం మెక్కింది చాల్లేదా..
నిజాయితీపరుడు రవీంద్రపైనే విమర్శలా?

- పేర్నినానీ వ్యాఖ్యలపై టీడీపీ అవనిగడ్డ నాయకులు ఆగ్రహం

అవనిగడ్డ, మే 17(ఆంధ్రజ్యోతి): పేదల బియ్యాన్ని మెక్కింది చాలక నిజాయితీపరుడైన మంత్రి కొల్లు రవీంద్రపైనే విమర్శలు చేస్తావా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానీపై టీడీపీ అవనిగడ్డ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి రవీంద్రపై శుక్రవారం పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా పని చేసి కొల్లు రవీంద్ర అందరి మన్ననలు పొందారని, కూటమి ప్రభుత్వంలోనూ ఎలాంటి ఆరోపణలు లేకుండా పని చేస్తున్నారని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో భార్య పేరుతో గోడౌన్లు తీసుకుని అందులో ప్రభుత్వం నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని దిగమింగిన పేర్ని నాని.. నిజాయితీపరుడైన కొల్లు రవీంద్రపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రవీంద్రను డమ్మీ మంత్రి అని వ్యాఖ్యానించటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. బలహీనవర్గాలపై ఆ పార్టీకి ఉన్న గౌరవాన్ని ఈ వ్యాఖ్యలే తేటతెల్లం చేస్తున్నాయన్నారు. రవీంద్రపై అవినీతి పరుడైన పేర్ని విమర్శలు చేయటం సిగ్గుచేటని, ప్రజలు ఆయన కుమారుడిని, వైసీపీని ఓడించి పక్కన పెట్టినా ఇంకా జ్ఞానోదయం కలగలేదని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ పాలక మండలి మాజీ సభ్యురాలు విశ్వనాథపల్లి పాప విమర్శించారు. టీడీపీ నేతలు బండే రాఘవ, మాదివాడ రత్నారావు, మేడికొండ విజయ్, గుంటూరు వినయ్, నాగిడి రాంబాబు, బచ్చు రాఘవయ్య, గోశాల బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరువూరులో మారుతున్న
రాజకీయ సమీకరణాలు

- శుక్రవారం రాత్రి క్యాంప్‌నకు మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): తిరువూరు చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తన పదవికి రాజీనామా చేయడంతో ఈనెల 19న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక జరగనుంది. దీంతో పట్టణంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. దీంతో ఏం జరుగుతుందోనని రాజకీయ ఉత్కంఠ పట్టణ ప్రజల్లో ఉంది. ఎవరు చైర్‌పర్సన్‌గా ఎంపికవుతారోనని పట్టణవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజకీయ సమీకరణాల్లో మార్పుల కారణంగా వైసీపీ నాయకత్వం ఇప్పటికే కొందరు కౌన్సిలర్లను పట్టణం దాటించింది. శుక్రవారం రాత్రి మరి కొందరు కౌన్సిలర్లను క్యాంప్‌నకు తరలించింది. బోర్డులో మొత్తం 17 మంది వైసీపీ సభ్యులున్నా ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆపార్టీ బలం తగ్గే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో వైసీపీ అధిష్ఠానంలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు పార్టీని వీడుతున్నట్టు జరుగుతున్న ప్రచారం ఆ పార్టీలో ప్రకంపనలు పుట్టిస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మునిసిపల్ ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీ, ఇతర పార్టీల నుంచి కొందరు కౌన్సిలర్లుగా పోటీచేసేందుకు నామినేషన్లు వేస్తే అప్పట్లో వైసీపీ నాయకులు, అభ్యర్థుల్ని బెదిరించి పోటీనుంచి విరమింపజేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, వైసీపీ కౌన్సిలర్లు అధికార పార్టీవైపు చూడటం తప్పులేదని కొందరు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

దుర్గగుడిలో ప్రొటోకాల్
దర్శనాలు క్రమబద్ధీకరిస్తాం

- ఈవో శీనా నాయక్ ప్రకటన

ఇంద్రకీలాద్రి, మే 17(ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ప్రొటోకాల్ దర్శనాలు క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఈవో శీనా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరికీ సులభంగా అమ్మవారి దర్శనం కల్పించడం కోసం భద్రత, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఒక క్రమ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వివిధ శాఖల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి వస్తున్న విన్నపాల ప్రకారం ప్రొటోకాల్ దర్శనాలు జరుగుతున్నాయని, అయితే వాటిని మరికొంత మెరుగ్గా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చే వారంతా దరఖాస్తును పూర్తిచేసి దేవస్థానం అధికారులకు ఇవ్వాలని సూచించారు. దర్శనం తేదీ, ఎప్పుడు.. ఎంత మంది వస్తున్నారు. దర్శనానికి వచ్చే ప్రధాన వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, వచ్చే వాహనం వివరాలు పూర్తి చేయాలన్నారు. ఆ మేరకు ప్రొటోకాల్ దర్శనాలను క్రమబద్ధీకరిస్తామని, దీంతో పాటు పారదర్శకత కూడా ఉంటుందని తెలిపారు. భద్రతా కారణాల రీత్యా తప్పనిసరిగా ఈ విధానాన్ని అమలు చేయాలని ఆయన సిబ్బందికి ఆదేశాలిచ్చారు. వచ్చిన విన్నపాల్లో వారి స్థాయి ప్రకారం ప్రొటోకాల్ విభాగం పరిశీలించి దర్శనం ఏర్పాట్లు చూస్తుందన్నారు.

యువతను దేశ సేవకులుగా తీర్చిదిద్దుతాం

- ఆసక్తి ఉన్నవారు వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి
- నోటిఫికేషన్ విడుదల చేసిన నెహ్రూ యువ కేంద్రం

విజయవాడ, మే 17(ఆంధ్రజ్యోతి): దేశంపై భక్తి, ప్రేమ ఉన్న యువతను దేశ సేవకులుగా తీర్చిదిద్దుతామని, ఆసక్తి ఉన్నవారు పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు, సైనికంగా, సామాజికంగా దేశంలో అత్యవసర పరిస్థితులు వచ్చినపుడు సివిల్ అడ్మినిస్ట్రేషన్‌కు సహాయపడేలా వలంటీర్ బృందాలను తీర్చిదిద్దుతామని, స్వతహాగా వచ్చిన యువతకు సరైన శిక్షణ ఇస్తామని జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి సుంకరి రాము తెలిపారు. ముఖ్యమైన కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, ప్రజాభద్రత, జనాలను నియంత్రించడం, విపత్తులు సంభవించినప్పుడు ఫస్ట్ ఎయిడ్ చేయడం, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న యువత హెచ్‌టీటీపీఎస్://మైభారత్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

వృత్తిలో రాణిస్తూ..ప్రవృత్తికి ప్రాణం పోస్తూ..



రంగస్థలంపై యువ ఇంజనీర్లు

- పద్యనాటకాలకు ఊపిరిలూదుతూ సరికొత్త పాత్ర పోషణ
- తెలుగు సంస్కృతి మూలాల విశిష్టతను చాటుతున్న కళాకారులు

తెలుగు పద్య నాటకం.. కళారూపం మాత్రమే కాదు. తెలుగు సంస్కృతికి శబ్దస్వరూపం. మన మూలాల చప్పుడు. విలువల పరిమళం. రంగస్థలాలపై వెండితెరలు, సోషల్ మీడియాలు ఆధిపత్యం చేస్తున్న రోజులివి. ఇలాంటి తరుణంలో పద్య నాటకానికి ప్రాణం పోస్తూ తమ భుజాన మోస్తూ కొత్త ప్రపంచానికి దాని గొప్పతనాన్ని పరిచయం చేస్తున్నారు కొందరు యువ ఇంజనీర్లు. ఇంజనీరింగ్ ల్యాబ్‌లు, సాఫ్ట్‌వేర్ బోర్డురూమ్‌లు, యూనివర్సిటీ అధ్యాపకుల గదులు ఇవి వారి జీవన రంగాలు. అయినా ఖాళీ సమయంలో పద్య నాటకాలు సాధన చేస్తూ కళను సజీవంగా ఉంచడం కోసం రంగస్థలాన వారు సరికొత్త పాత్ర పోషిస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్

పద్యనాటకాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పం



కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న జొన్నలగడ్డ శ్రవణ్‌కుమార్

పౌరాణిక పద్యనాటక రంగంలో ఎంతో కీలకమైన సంగీత విభాగానికి హార్మోనిస్టుగా పాతికేళ్లుగా సేవలందిస్తూ కళాసాధన చేస్తున్నారు జొన్నలగడ్డ శ్రవణ్ కుమార్. ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేసి, ప్రస్తుతం చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారాయన. ప్రవృత్తిరీత్యా ఎనిమిదేళ్లుగా డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి అధినేత డాక్టర్ పి.వి.ఎన్. కృష్ణ మార్గదర్శకత్వంలో అనేక పద్యనాటకాలకు సంగీత సహకారం అందించారు. 2023లో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో విజ్ఞాన భారతం సాంఘిక నాటకానికి ఉత్తమ రంగాలంకరణ విభాగంలో నంది అవార్డు వచ్చింది. దూరదర్శన్, ఆకాశవాణి వేదికలపై పౌరాణిక పద్యనాటకాలకు సంగీత దర్శకత్వం వహిస్తూ, హార్మోనియం వాయిస్తుంటారు. తండ్రి, శ్రీ రామకృష్ణ నాట్యమండలి అధినేత జొన్నలగడ్డ జగన్మోహన్‌రావు ఈ రంగంలో శ్రవణ్‌ను పరిచయం చేసి, సంగీతం నేర్పించి, ఒక హార్మోనిస్టుగా, సంగీత దర్శకుడిగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటి వరకు 20కు పైగా పద్యనాటకాలకు సంగీతం సమకూర్చి, 1000 ప్రదర్శనలకు సంగీత సహకారం అందించారు. డాక్టర్ పి.వి.ఎన్. కృష్ణ శిక్షణలో యువ కళాకారులను తీర్చిదిద్దుతూ, పద్యనాటకాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. సంస్కార భారతి విజయవాడ మహానగర్ ప్రధాన కార్యదర్శిగా, శ్రీ రామకృష్ణ నాట్యమండలి సాంస్కృతిక సేవా సంస్థ కార్యదర్శిగా, శ్రీ సాయిబాబా నాట్యమండలి, భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్లకు సహకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సమాజానికి మంచి సందేశం చేరాలనే తపన



టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పి. సాయిసౌమ్య

పి. సాయిసౌమ్య.. పాఠశాలలో చదివే రోజుల్లోనే తన తల్లి ప్రోత్సాహంతో చిన్న చిన్న స్కిట్స్ లో నటించేవారు. అప్పుడే నటనంటే ఆమెకు ప్రత్యేకమైన ఆసక్తి కలిగింది. చదువు పూర్తయ్యాక, టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరారు. కళాకారుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ కుమారుడు, సంగీత నాటక కళాకారుడు పి.సాయిశంకర్‌ను వివాహమాడారు. వివాహం తర్వాత వారి ఇంట్లో తరచూ నాటకాలు, కళాపరమైన కార్యక్రమాలు జరుగుతుండేవి. 'శ్రీ మాధవ వర్మ' నాటకంలో కనక దుర్గమ్మ పాత్ర వేసే అవకాశం ఆమెకు వచ్చింది. ఆ నాటకంలో ప్రేక్షకుల స్పందన చూసినప్పటి నుంచి నటనపై మరింత మక్కువ పెరిగిందామెకు. కుటుంబం సహకారంతో నాటకరంగంలో కొనసాగుతున్న ఆమె ఏ పాత్ర వేసినా, ప్రేక్షకులకు మంచి సందేశం చేరాలని, సమాజానికి ఉపయోగపడాలని చెబుతున్నారు. నటన కేవలం వినోదానికే కాదని.. మనమూ, సమాజమూ మారాలనుకునే ఒక వేదికని నమ్ముతానంటున్నారు.

నాటకాలంటే మమకారం



రైల్వేలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న చింతా దూండీ కృష్ణ

చింతా దూండీ కృష్ణ..ఓ సాధారణ రైతు బిడ్డ. నాటకాలంటే చిన్నప్పటి నుంచి అపారమైన మమకారం. ఊరి పెద్దలు చెప్పిన కథలు, పల్లకీ పాటలు వింటూ పెరిగారు. కళంటే మక్కువ. అదే ఆయనను విజయవాడకు తీసుకొచ్చింది. ఇక్కడ డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్యమండలిలో డాక్టర్ పీవీఎన్ కృష్ణదగ్గర శిక్షణ ప్రారంభించారు. అనేక పద్యనాటకాల్లో దుర్యోధనుడు, ద్రోణుడు, కుంభాండుడు, పృథ్వీరాజ్ రాసోలో ప్రధాన హాస్యనటుడిగా, 'జయహో చత్రపతి శివాజీ మహారాజ్'లో పతేఖాన్ పాత్రతో ప్రేక్షకులను మెప్పించారు. ఉద్యోగంలో స్థిరపడాలన్న తపనతో ఇండియన్ రైల్వేస్‌లో టెక్నీషియన్ ఉద్యోగం సంపాదించారు. ఉద్యోగంతో పాటు రంగస్థలాన్నీ వదల్లేదు. ఈ మధ్యే డాక్టర్ ఎం.ఎస్.చౌదరి దర్శకత్వంలో ఇంటర్ రైల్వే హిందీ డ్రామా కాంపిటీషన్‌లో పాల్గొని, జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడు అవార్డు పొందారు. 'రాణా ప్రతాప్' అనే ఏక పాత్ర ప్రదర్శనతో పలు నాటికల పోటీల్లో గుర్తింపు తెచ్చుకున్నారు.

కొండపల్లి బొమ్మల ఖ్యాతిని చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

- పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



కొండపల్లిలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న కొండపల్లి బొమ్మల ఖ్యాతిని నేటి తరానికి చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, అందుకు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలో శనివారం పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు పనులను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. పర్యాటకంగా జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు అపార అవకాశాలున్నాయని కలెక్టర్ అన్నారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కొండపల్లి బొమ్మల విశిష్టతను తెలిపేలా అందమైన పెయింటింగ్స్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరించాలని ఆదేశించారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుంచి ఖిల్లా వరకు పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించుకొనేలా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి త్వరితగతిన వినియోగంలోనికి తీసుకువచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏపీ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ అధికారి ఎస్.పద్మారాణి, టూరిజం కన్సల్టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై ప్రజలను చైతన్యవంతులను చేద్దాం

- అధికారులు, సిబ్బంది విధిగా స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొనాలి: డీఎఫ్ఎస్వో ఎ.రవీంద్రరావు



ఎన్టీఆర్ జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ఆవరణలో చీపుళ్లతో శుభ్రం చేస్తున్న ఎ.రవీంద్రరావు తదితరులు

కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధిగా స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని, పరిసరాలను పరిశుభ్రపరచడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా స్వర్ణాంధ్ర 2047లోని స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను చేరుకోగలుగుతామని జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి (డీఎఫ్ఎస్వో) ఎ.రవీంద్రరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి ఎ.రవీంద్రరావు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ జె.సుమన్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల డీసీవో ఎ.మురళీకృష్ణ ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీట్ ది హీట్ ఇతివృత్తంతో ఈనెల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపుతుండడంతో సహచార అధికారులతో కలిసి కార్యాలయ సందర్శకులకు చల్లని తాగునీరు, మజ్జిగను రవీంద్రరావు పంపిణీ చేశారు.

బంగారం మాయ!

(5వ పేజీ తరువాయి)

డిజైన్లు కంటే పదుల సంఖ్యలో ఎక్కువగా ఆభరణాలు ఇక్కడ లభిస్తున్నాయి. దీంతో పెళ్లిళ్లు, శుభకార్యాలతో పాటు ఆభరణాలపై పెట్టుబడి పెట్టేవారు హోల్‌సేల్ బంగారు ఆభరణాల దుకాణాలలో నగలను కొనుగోలు చేస్తుంటారు. ఈ దుకాణాలలో ప్రతిరోజూ కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు జరుగుతాయి.

అప్రమత్తంగా లేకపోతే అంతే..

ఇటీవల ఓ మహిళ జైహింద్ కాంప్లెక్స్ హోల్‌సేల్ ఆభరణాల దుకాణంలో సుమారు రూ.5లక్షల విలువ చేసే బంగారు ఆభరణాన్ని కొనుగోలు చేశారు. అయితే ఆమె అవసరాల నిమిత్తం ఆ బంగారు ఆభరణాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకోవటానికి ప్రయత్నించగా, బ్యాంక్ అధికారులు రూ.3 లక్షలకు మించి రుణం ఇవ్వటం కుదరదని చెప్పటంతో ఆమె షాక్‌కు గురైంది. దీంతో ఆమె బంగారాన్ని కొనుగోలు చేసిన దుకాణాదారుడి వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే ఆభరణాల్లో రాళ్ల బరువు మినహాయిస్తే, బంగారం బరువు అంతే ఉంటుందని సదరు వ్యాపారి చెప్పాడు. 52 గ్రాముల బరువు ఉన్న ఆభరణానికి రూ.4.94 లక్షలు ధర నిర్ణయించగా, మహిళకు రూ.4.70 లక్షలకు విక్రయించారు. ఆభరణాన్ని విక్రయించేటప్పుడు రూ.52.5 గ్రాముల బరువుకు రూ.9వేలు చొప్పున ధర వసూలు చేశారు. బ్యాంకులో ఆభరణం విలువను లెక్కించేటప్పుడు ఆభరణంలో సుమారు 13 గ్రాముల రాళ్ల బరువు ఉన్నట్లు అప్రైజర్ తేల్చాడు. బంగారు ఆభరణంలో ఉన్న 9 పెద్ద పూసలు ఒక్కొక్కటి 0.750 మిల్లీ గ్రాములు, మిగిలిన రాళ్లు కలిపి 12 నుంచి 13 గ్రాముల బరువు ఉంటాయని, ఆభరణం బరువు 38 గ్రాముల లోపు ఉంటుందని లెక్కించాడు. ఈ వ్యవహారంలో 13 గ్రాముల రాళ్ల బరువుకు కూడా రూ.9వేల చొప్పున బంగారం ధరను వసూలు చేసిన దుకాణదారుడు వారికి జీఎస్టీ రూపంలో లాభం వచ్చినట్లు నమ్మించాడు. తరుగు 2 శాతంలోపే తీసుకున్నానని చెప్పాడు. కొనుగోలు చేసిన బంగారం ఆభరణం అసలు బరువు లెక్క మాత్రం చెప్పలేదు. బ్యాంక్ లెక్కల్లో 38 గ్రాముల మాత్రమే బరువు తేలటంతో హోల్‌సేల్ లెక్క తేల్చాలని బాధితురాలు దుకాణం యజమానిని నిలదీశారు.

గుట్టుచప్పుడు కాకుండా సెటిల్‌మెంట్

రాళ్ల బరువుతో కలిపి ఆభరణం విలువను లెక్కించటం, హోల్‌సేల్ పేరుతో ఆభరణంలో బంగారం బరువును లెక్కలో చూపకుండా రాళ్ల బరువుతో కలిపి మొత్తం బరువును లెక్కించటంపై పోలీసులు దుకాణదారుడిని ప్రశ్నించారు. దీంతో దుకాణదారుడు బాధితురాలు కొనుగోలు చేసిన డబ్బులను తిరిగి ఇచ్చేస్తానని పోలీసులకు చెప్పటంతో గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారం ముగిసినట్లు తెలిసింది. రోజూ కోట్లాది రూపాయల లావాదేవీలు జరిపే పలువురు వ్యాపారస్తులు జీఎస్టీలు, బిల్లులు లేకుండా ఆభరణాల విక్రయాలు యథేచ్ఛగా జరగటం సందేహాలకు తావిస్తోంది. లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులకు తెలిసే విజయవాడలో బంగారం జీరో వ్యాపారం ప్రతిరోజూ కోట్లలో జరుగుతుందని పలువురు వ్యాపారస్తులే బహిరంగంగా చెబుతున్నారు. సాధారణ రంగు రాళ్లకు బంగారంతో సమానంగా ధర వసూలు చేయటం, అదే ఆభరణం బరువుగా నిర్ధారిస్తూ వాటికి సర్టిఫికెట్లను ఇవ్వటం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పూడికతీత లేనట్టే..!

(5వ పేజీ తరువాయి)

కాలువల అభివృద్ధికి వినియోగించే అంశంపై రెండు, మూడు రోజుల్లో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం రాజధాని అమరావతిలో జరగనుంది. ఈ సమావేశంలో కృష్ణాజిల్లాకు ఈ నిధులను అందుబాటులోకి తెచ్చి, వాటితో చేయాల్సిన పనులకు సంబంధించిన నివేదికలపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో నిధుల కేటాయింపునకు ఆమోదం లభిస్తుందా లేదా అనే అంశంపైనా రైతుల్లో ఉత్కంఠ నెలకొంది.

అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల మరమ్మతుల సంగతేంటి?

దివిసీమలోని కోడూరు, నాగాయలంక మండలాల్లోని ఏడు, మోపిదేవి, మచిలీపట్నం మండలంలోని ఏడు అవుట్ ఫాల్ స్లూయిస్‌ల గేట్లు కొట్టుకుపోయాయి. మచిలీపట్నం మండలంలో 12 గ్రామాల్లోని ఐదు వేల ఎకరాల్లోకి ఉప్పునీరు ప్రవేశించి వరిపైరు చనిపోతోంది. కోడూరు, నాగాయలంక మండలాల్లోని ఏడెనిమిది గ్రామాల్లో మరో ఐదు వేల ఎకరాల్లోకి ఉప్పునీరు ప్రవేశిస్తుండటంతో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అవుట్ ఫాల్ స్లూయిస్‌లకు కనీస మరమ్మతులు చేయాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. దివిసీమలోని అవుట్ ఫాల్ స్లూయిస్‌లకు మరమ్మతులు చేసేందుకు రూ.37 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇటీవల సాంకేతి బృందం ఈ అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పరిశీలించి వెళ్లింది. అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని అవుట్ ఫాల్ స్లూయిస్‌లకు కనీస మరమ్మతులు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అవినీతి కంపు!

(5వ పేజీ తరువాయి)

ఇస్తారు. ఎందుకంటే వారి నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటారు. నగరంలో దుకాణాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కళ్యాణ మండపాలు ఇలా ప్రతి చోట అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. శానిటరీ సిబ్బంది చేయాల్సిన పనులను సచివాలయ శానిటరీ కార్యదర్శులతో క్షేత్ర స్థాయిలో చేయిస్తున్నారు. మునిసిపల్ నిబంధనల కంటే అదనంగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఏమొచ్చిందో ఉన్నతాధికారులు చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు ఇప్పుడు కూడా కొనసాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణ ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సుజనాచౌదరిని పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సుజనా చౌదరికి సీఎం చంద్రబాబు పరామర్శ

వన్‌టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల సుజనా చౌదరి లండన్ పర్యటనలో గాయపడి, డాక్టర్ల సలహా మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని సుజనాచౌదరి నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుజనా చౌదరి త్వరగా కోలుకుని, తిరిగి ప్రజా సేవకు పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు.



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

సిలబస్‌లో మార్పులు తీసుకురండి

- ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ అనురాధకు చరిత్ర అధ్యాపకుల వినతి

పాయకాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): చరిత్ర సిలబస్‌లో మార్పులు తీసుకు రావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు శనివారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ చరిత్రకు ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం చరిత్ర సిలబస్‌లో పలు మార్పులు చేసిందని సభ్యులు ఆమెకు వివరించారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా చరిత్ర సిలబస్‌లో మార్పులు చేసి ప్రాంతీయతకు పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ జాయింట్ సెక్రటరీ గోవింద సురేంద్ర, సభ్యులు రాజ్ మహ్మద్, బడే సాహెబ్ పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విజయవాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : నున్న వేణుగోపాల స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం చేపట్టిన పూజా కార్యక్రమాల్లో శనివారం అష్టబంధన ప్రయోగం, భాగవత విశిష్టతలను పండితులు భక్తులకు వివరించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు రేంపిచర్ల అప్పలా చార్యులు, శేషాచార్యులు, దత్తకుమార స్వామి వారికి అభిషేకాలు అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ వేద పండితులు సుదర్శనం సీతారామాచార్యులు భాగవతం విశిష్టతను భక్తులకు వివరించారు.

సైన్యానికి సెల్యూట్

- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తాడిగడప మునిసిపాలిటీలో భారత శౌర్య తిరంగా యాత్ర
- దేశభక్తి నినాదాలతో హోరెత్తిన బందరు రోడ్డు
- ఉగ్రదాడికి వ్యతిరేకంగా తరలివచ్చిన జనం
- ముందుండి నడిపించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కూటమి నాయకులు

పెనమలూరు, మే17 (ఆంధ్రజ్యోతి): దేశ సంరక్షణ కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న వీరుల్లారా.. మేమంతా మీవెంటే ఉన్నాం. భారత్ జోలికి వస్తే శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తాం.. దేశంకోసం అమరులైన వీరసైనికులకు వందనం..మీ శౌర్యానికి మాప్రణామాలు...భారత్‌మాతాకీ జై..వందేమాతరం అంటూ వేలాది ప్రజలు శనివారం వెలగపూడి కోల్డ్‌స్టోరేజీ నుంచి పోరంకి సెంటర్ వరకు జరిగిన తిరంగా యాత్రలో నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బందరు రోడ్డుపైకి వేలాది ప్రజలు వచ్చి భారతసైన్యానికి సంఘీభావం తెలియజేయడంతో బందరు రోడ్డు త్రివర్ణ పతాక రెపరెపలతో మురిసి పోయింది. దేశభక్తి నినాదాలు యువతలో స్ఫూర్తిని నింపాయి. ర్యాలీలో యువత నుంచి అన్ని వయస్సుల వారు త్రివర్ణ పతాకాన్ని చేబూని కదం తొక్కారు. ర్యాలీలో ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీ నాయక్ ఫోటోలను ప్రదర్శిస్తూ త్రివిధ దళాలను కీర్తిస్తూ ప్రజలు ముందుకు సాగారు. తిరంగా యాత్రను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబులు ముందుండి నడిపించారు. ముస్లింలు జాతీయజెండాలతో ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు.



తిరంగా యాత్రలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కూటమి నేతలు

ఉగ్రవాదుల పీచమణుస్తాం : ఎమ్మెల్యే బోడె

పహల్గాంలో టూరిస్టులపై జరిగిన అత్యంత పాశవిక దాడికి ప్రతిగా ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ సైన్యం చేసిన భీకరదాడులకు సంఘీభావంగా జరిగిన ఈ తిరంగా ర్యాలీ ద్వారా పాకిస్థాన్, తాను మద్దతిస్తున్న ఉగ్రవాదుల పీచమణుస్తామనే హెచ్చరికలు జారీ చేసినట్లయిందని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. భార్యల ఎదుటే భర్తలను అతికిరాతకంగా కాల్చి పొట్టన పెట్టుకొని, భార్యల సిందూరాలను తుడిచివేసిన ఉగ్రమూకలను తుడిచి పెట్టిన పది రోజుల్లోనే వారి స్థావరాలను కనుక్కొని వెంటాడి వేటాడి హతమార్చిన మన సైన్యానికి పూర్తి హక్కులు కల్పించిన భారత ప్రధానికి అందరూ ఈర్యాలీ ద్వారా మద్దతు పలికినట్లయిందని తెలిపారు.

పాకిస్థాన్ ఆటలు సాగవ్

సరిహద్దుల్లో సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ దశాబ్దాలుగా మనదేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ ఆటలు ఇకసాగవని టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబులు తెలిపారు. పాకిస్థాన్ కంటే అన్ని రంగాల్లో ఎంతో ఎత్తులో ఉన్న భారత్‌ను ఎదుర్కోలేక నిన్నమొన్న జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో చేతులెత్తేసిన పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతు వెనక్కి తీసుకోకపోతే దాని మూలాలు కూడా మిగలవని హెచ్చరించారు. కార్యక్రమంలో బోడె హేమచౌదరి, బోడె వెంకట్రాం, టీడీపీ రెహమాన్, యార్లగడ్డ సుచిత్ర, కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధన కోటేశ్వరరావు, షేక్ బుజ్జి, తాతపూడి గణేష్, ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర

ప్రసాదంపాడు : ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా రామవరప్పాడు బల్లెంవారి వీధిలో నిర్వహించిన తిరంగా యాత్రలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతకి జై అంటూ నినదించారు. పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన త్రివిధ దళాల సత్తా ఎంటో చూపించారని కొనియాడారు. ఉగ్రవాదం పేరుతో దేశాభివృద్ధిని అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలు మన దేశాన్ని నిలువరించలే వన్నారు. ఉగ్రవాదులపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. అత్యంత కచ్చితత్వంతో క్షిపణులను ప్రయోగించి దాయాది దేశాన్ని గడగడలాడించారని, ప్రపంచంలో శక్తిమంతమైన సైన్యం మన సొంతమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్, సర్పంచ్ వరి శ్రీదేవి, ప్రసాదంపాడు టీడీపీ యువ నాయకులు సర్నాల బాలాజీ, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, కళ్లేపల్లి సాయి రామారాజు, కొంగన రవి, అద్దేపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

హనుమాన్‌జంక్షన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజవీడు రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని కారుణ్య చర్చి రోడ్డులో రాజనాల వెంకట రాజేశ్ (53) ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం రాత్రి మృతి చెందాడు. జంక్షన్ ఎస్సై వి.సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరంలో నివాసం ఉంటున్న మృతుడు జంక్షన్‌లో ఉన్న తన ఇంటికి రంగులు వేయడానికి కుటుం బ సభ్యులతో కలిసి శుక్రవారం వచ్చాడు. గోడకు రంగులు వేస్తున్న సందర్భం లో స్విచ్ బోర్డు నుంచి పెయింట్ బ్రెష్ ద్వారా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి శనివారం మృతదేహానికి గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

హనుమాన్‌జంక్షన్,మే 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతోందన్న కారణంతో సిరివాడ గ్రామంలో వృద్ధురాలు తలారి మేరీఫ్లోరెన్స్ (60)ను ఈ నెల 14న హతమార్చిన ఇద్దరు నిందితులను హనుమాన్‌జంక్షన్ సీఐ సత్యనారాయణమూర్తి శనివారం అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచారు. నిందితులిరువురికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. సీఐ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. హతురాలు మేరీఫ్లోరెన్స్ కుమార్తె తలారి ప్రశాంతి అలియాస్ సోని బాపులపాడు గ్రామానికి చెందిన కనకవల్లి సుందరంతో వివాహేతర సంబంధం నెరపుతోంది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న తల్లిని తొలగించుకోవడానికి ప్రియుడు సుందరం, సోనీ సహకారంతో హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఏ1 ముద్దాయిగా సుందరం, ఏ2 ముద్దాయిగా సోనీలపై వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసిన మీదట దర్యాప్తు జరిపి వేలేరు అడ్డరోడ్డు వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

మినీ మహానాడు విజయవంతం చేయండి

కంకిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మినీ మహానాడును విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధ్యక్షతన 18న ఆదివారం పెనమలూరు నియోజకవర్గ స్థాయి మిని మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహానాడులో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

టీడీపీ నేత అట్లూరికి పరామర్శ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న టీడీపీ నాయకుడు అట్లూరి శ్రీనివాస్‌ను ఎవెఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ శనివారం పరామర్శించారు. గుండెకు సంబంధించిన అనారోగ్యంతో ఇటీవల విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన అట్లూరి శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. లయన్స్ కార్యవర్గ సభ్యులు యలమంచలి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గన్నవరం, మే 17 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శి పాలడుగు శ్రీమన్నారాయణ, బత్తుల శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శనివారం మండలంలోని సావరగూడెంలో కరపత్రాలను పంపిణీ పసుమర్తి వీరాంజనేయులు, బోయిన జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈసెట్‌లో కలవపాముల శ్రీజ్యోతి పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. లేట్రల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రతిష్టా త్మకంగా అనంతపురం జేఎన్‌టీయూ నిర్వహిం చిన ఈసెట్- 2025 ఫలి తాలు విడుదల కాగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ నుంచి 103 ర్యాంకులు, కంప్యూటర్ ఇంజనీరింగ్ 60 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ విభాగం 57 ర్యాంకులు, ఎలక్ట్రికల్ విభాగం 11 ర్యాంకులతో పాటు ఇతర విభాగాలతో కలిపి 282 ర్యాంకులు సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ ఎస్.వి.రమణ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ జె.శివకుమార్, అన్ని విభాగాల శాఖాధిపతులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్

ఉయ్యూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధనకు అందరం కలసి కృషి చేద్దామని ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. ప్రతినెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా కడవకొల్లులో ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ సురేశ్‌కుమార్‌తో కలసి ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు.



కడవకొల్లులో గ్రామస్థులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో హేలాషారోన్, మండల అధికారులు

సర్పంచ్ మంగినేని సుధారాణి, కొండా ప్రవీణ్, కుప్పాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంవద్ద స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణను తహసీల్దార్ సురేశ్‌కుమార్, జబర్లపూడి సర్పంచ్ శేషవరప్రసాద్, కార్యాలయ సిబ్బందితో కలసి చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. ప్రభుత్వ వైద్యశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, డాక్టర్ స్ఫూర్తి, మురళి, రోహిణి పాల్గొని వేసవిలో తీసుకోవలసిని ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. వైద్యశాల ఆవరణ శుభ్రపరిచారు. ఉయ్యూరు లో జరిగిన కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

ప్రసాదంపాడు : రామవరప్పాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్రా.. స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ నిర్మాణానికి ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ నివాసస్థలం ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షులు కొల్లా ఆనంద్ కుమార్, టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రథమ చికిత్సపై అవగాహన

గన్నవరం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తతోనే ప్రాణాలను కాపాడవచ్చని డాక్టర్ టి. చైతన్యకృష్ణ అన్నారు. మండలంలోని కేసరపల్లి డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో ప్రథమ చికిత్సపై శనివారం శిక్షణ ఇచ్చారు. దీనిని లెఫ్టినెంట్‌కల్నల్ తీర్థ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, విపత్కర పరిస్థితుల్లో ప్రాణనష్టం సంభవించినప్పుడు ధైర్యంతో ప్రథమ చికిత్సలు చేసి ఆ తరువాత దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నారు. ఫస్ట్ ఎయిడ్‌పై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఆర్ కిషోర్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఫస్ట్ ఎయిడ్‌పై ఎన్‌సీసీ క్యాడెట్లకు మినిమం నాలెడ్జ్ ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులలోనే కాకుండా దేశ నిర్మాణంలో కూడా భాగస్వామ్యం కావాలన్నారు. యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమవంతు బాధ్యతను నిర్వహించాలని వివరించారు. అవసరమైన సమయాల్లో దేశానికి సమర్థవంతంగా సేవ చేయడానికి ఎన్‌సీసీ క్యాడేట్లు సిద్ధంగా ఉండాలన్నారు. డాక్టర్ బోయపాటి అక్షర పాల్గొన్నారు.



ప్రథమ చికిత్స చేస్తున్న డాక్టర్ చైతన్య కృష్ణకుమార్

పుస్తక పఠనంతో భాషపై నైపుణ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు భాషా నైపుణ్యం పెరుగుతుందని ఉపాధ్యాయుడు నందమూరి ప్రసాద్ తెలిపారు. వీరవల్లి గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర పరిరక్షణకు డస్ట్‌బిన్ల వినియోగం, చెత్త నుంచి సంపద సృష్టి గురించి వివరించారు.

ఉయ్యూరు : ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. బాలికలకు మ్యూజికల్ చైర్స్, బాలురకు ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు కథల పుస్తకాలు చదివించి వాటిలో నీతిని తెలియజేశారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తక పఠనంపై సూచనలిస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు



క్రేన్ సాయంతో రావిచెట్టును వేరే ప్రాంతానికి తరలించి అక్కడ నాటుతున్న ట్రాఫిక్ పోలీసులు

ఇక్కడ పెకిలించారు.. అక్కడ ప్రాణం పోశారు..!

వేళ్లతో చెట్టును తొలగించి మరోచోట నాటిన పోలీసులు

గొల్లపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లవేళలా పచ్చదనంతో మెండైన కొమ్మలతో ఉండే రావిచెట్టును గొల్లపూడి వన్ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్న దృష్ట్యా శనివారం తొలగించారు. అయితే మరలా అదే పచ్చదనంతో అవే మెండైన కొమ్మలతో ఉండే రావిచెట్టును ప్రజలకు నీడ నిచ్చేందుకు వేరేచోట దాన్ని నాటి ప్రాణం పోశారు. కూకటివేళ్లతో పెకలించిన అవే వేళ్లను భూమిలోకి చేర్చి సహజ సిద్ధంగా మలిశారు. 30ఏళ్ల నుంచి అక్కడున్న రావిచెట్టును ట్రాఫిక్ పోలీసుల సహకారంతో క్రేన్ ద్వారా తొలగించి సమీపంలోని బస్సు షెల్టర్ పక్కన ఖాళీ ప్రదేశంలో తిరిగి నాటారు. ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు చల్లని నీడను ఇచ్చేందుకు అక్కడ నాటారు. ఉద్యానవనం విభాగాధిపతి వి.ఎస్.ధర్మజ ఈ వృక్ష సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, చిత్రంలో జడ్జి పాండురంగారెడ్డి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

● ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే వాటి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాలులో శనివారం ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్డీటి) సమావేశం జిల్లా 6వ అదనపు జడ్జి పీ పాండురంగారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో స్కానింగ్ కేంద్రాల ఏర్పాటు, రెన్యువల్‌కు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. ఈ పరీక్షలు చేయాలని అడిగిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తికి సంబంధించిన వివరాలను జడ్జి పాండురంగారెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 89 స్కానింగ్ కేంద్రాలుండగా, వాటిలో 17 ప్రభుత్వ, 72 ప్రైవేటు కేంద్రాలున్నాయని తెలిపారు. పునరుద్ధరణకు మూడు, రద్దు కోసం ఒక స్కానింగ్ కేంద్రం నుంచి దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. డీఎంహెచ్‌వో శర్మిష్ట, కమిటీ సభ్యులు ధర్మతేజ, పీ వెంకటేశ్వరరావు, సీహెచ్ వాణిశ్రీ పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభించి కళావేదికకు హారతి ఇస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధమ్మ

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

● ఉత్సవ పందిరి, కళావేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని సతీమణి

హనుమాన్‌జంక్షన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం 24వ హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధమ్మ ఉత్సవ పందిరికి రిబ్బన్ కట్‌చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం హారతి ఇచ్చి కళావేదికను ప్రారంభించగా దాసాంజనేయ భజన సమాజం బృందం 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యుల స్వామికి సుప్రభాత సేవ, అర్చన, గోత్ర నామాలతో పూజలు జరిపారు. 1008 గులాబీలతో ప్రత్యేక పూజా నిర్వహించారు. మొదటి రోజు స్వామి అలంకరణకు కర్నాటక, సింధనూరుకు చెందిన కంకటాల రామసుబ్బారావు, ఉమాదేవి దంపతులు పుష్ప వితరణ చేశారు. ఉత్సవాలు సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం భక్తులకు మజ్జిగ పంపిణీని రామాలయం వద్ద ఏర్పాటు చేసింది. ఈవో పీ తారకేశ్వరరావు పర్యవేక్షణలో కూటమి నేతలు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, పావులూరి రామారావు, గారపాటి రామసీత, వడ్డి వాసవి, మూల్పూరి గోపీచంద్,గరికపాటి నాగేశ్వరరావు, పాబోలు రమేశ్, కలిపిండి అప్పారావు, ఆర్యవైశ్య సంఘం నేతలు పైడి సుధాకర్, కొనకళ్ల రాజశేఖర్, పాబోలు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

వేసిన తాళాలు వేసినట్టే..!

● తెరుచుకోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్



మణప్పురం ఫైనాన్స్ కార్యాలయానికి వేసి ఉన్న తాళం

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుట్టాయిపేటలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ తాళాలు శనివారం కూడా తెరుచుకోలేదు. ఖాతాదారు దీప్తి 2002లో కుదువపెట్టిన బంగారం మాయమైందంటూ శుక్రవారం ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. బాధితురాలు శుక్రవారం తాళం వేసి వెళ్లిపోయింది. మేనేజర్ ఆ సమస్యను పరిష్కరించలేకపోయారు. 2002లో ఉన్న మేనేజర్ ఇందుకు బాధ్యుడని ఉన్నతాధికారులకు బంగారం గోల్‌మాల్ అయిన సంగతి ఫిర్యాదు చేశామన్నారు. కాగా శనివారం పలువురు ఖాతాదారులు బాకీ చెల్లించేందుకు వచ్చి వెనుతిరిగారు. ఈ నేపథ్యంలో మేనేజర్ విధులకు ఆటంకం కలిగిందంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం బాకీ తీర్చినప్పటికీ తన బంగారం తిరిగి ఇవ్వలేదంటూ బాధితురాలు దీప్తి శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ఎదుటకు ఈ సమస్యను తీసుకుని వెళ్లేందుకు దీప్తి మేనేజర్ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎవరికి తొలి ప్రాధాన్యత

'పేదలకే తమ తొలి ప్రాధాన్యత' ప్రజా ప్రతినిధుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఊదరగొట్టే డైలాగ్ ఇది. మరి వాళ్లు ఈ చిత్రాన్ని చూస్తే ఏమంటారో..! వైద్య కోసం వచ్చే అభాగ్యులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన స్ట్రెచర్స్ ఉద్యోగుల తమ సొంత పనులకు, బెడ్‌షీట్స్, వైద్య పరికరాలు తరలించడానికి ఉపయోగిస్తున్నారు. దీంతో వాటి అవసరమున్నవారికి అవి దొరక్క అనేక అవస్థలు పడుతూనో, వేరేవారి సాయంతో ఆసుపత్రి లోపలికి వస్తున్నారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో కనిపించిన దృశ్యాలివి..



నైపుణ్యంతోనే శిఖరాగ్రం

స్కిల్ డెవలప్‌మెంట్‌తో యువతకు ఉపాధి

ఐటీఐ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్ ● 1644 సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం ● నైపుణ్య శిక్షణ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు

ఆంధ్రజ్యోతి, భారతీనగర్: యువతకు వృత్తి విద్య కోర్సుల్లో నైపుణ్య శిక్షణను అందించి స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడంలో పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లు కావాల్సిన భరోసా ఇస్తున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ రంగప్రవేశం చేయటంతో ఐటీఐ మళ్లీ పునరుజ్జీవం పోసుకోవటంతో పాటు ఏకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనే ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదుగుతోంది. ఐటీఐలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాయి. మెలకువలపై పట్టుసాధించడం, కోర్సులు పూర్తికాగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభించడంతో స్వల్పకాలిక వ్యవధిలోనే యువత జీవితాల్లో స్థిరపడి కుటుంబాలకు అండగా ఉంటున్నారు. ఇటీవల టెన్త్ ఫలితాలు రావడంతో టెక్నికల్ కోర్సులు చదువుకొనే విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐలో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. టెన్త్ విద్యార్హతతో రెండేళ్ల కోర్సులు చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఒక ప్రభుత్వ ఐటీఐ కళాశాల, 10 ప్రైవేట్ కళాశాలు అందుబాటులో ఉన్నాయి 2025-25 విద్యా సంవత్సరానికి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశించడానికి 1644 సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు.



రాయల్ ఎన్‌ఫీల్డ్ ల్యాబ్ శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఐటీఐలో ట్రేడులు వివరాలు

ఎలక్ట్రానిక్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), ఎలక్ట్రీషియన్, మెకానిక్ (మోటర్ వెహికల్) మిషనిస్ట్, టర్నర్, ఫిట్టర్, వైర్‌మెట్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్ టెక్నీషియన్ వంటి రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. టెన్త్ విద్యార్హతతో ఏడాది కోర్సులు చేయడానికి కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, మెకానికల్ డీజిల్ వంటి కోర్సులు, 8వ తరగతి విద్యార్హతతో సూయింగ్ టెక్నాలజీ, వెల్డర్ వంటి ఏడాది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐలో ప్రత్యేక శిక్షణ ట్రేడ్‌లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ ల్యాబ్, మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ పెయింటింగ్, అండ్ టెస్టింగ్ ల్యాబ్, ఏఆర్‌అండ్ వీఆర్ ల్యాబ్‌లు ఏడాది నుంచి అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థులకు డ్రైవింగ్ శిక్షణలో మెళకువలు నేర్పడంతో పాటు నేరుగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చేందుకు మినీ వాహనం కూడా ఉంది.

స్కిల్ డెవలప్‌మెంట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా విద్యార్థులకు 3 నెలల శిక్షణ అందించిన వెంటనే ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఐదేళ్లలో ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిటర్, టర్నర్, మెకానికల్ డీజిల్ తదితర కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థల్లో 35శాతం ఉద్యోగాలు సాధించారు.

నేరుగా పాలిటెక్నిక్ సెకెండియర్‌లోకి..

ఐటీఐలో రెండేళ్ల కోర్సును పూర్తిచేసి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో అదే (ఐటీఐలో ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి తదితర కోర్సులో పూర్తి చేసిన) కోర్సుల్లో రెండో సంవత్సరంలోకి ప్రవేశించి విద్యను అభ్యసించవచ్చు.

ఉద్యోగ, అప్రెంటిస్ షిప్

ఐటీఐ కళాశాలల్లో శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ, అప్రెంటిస్‌షిప్‌కు ప్రాధాన్యత కల్పిస్తున్నాయి. ఏటా జిల్లాలో ఐటీఐ పూర్తి చేసి అర్హులైన విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ, అప్రెంటిస్ షిప్ అవకాశాలు కల్పిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ఒక ప్రభుత్వ ఐటీఐ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలున్నాయి. వీటిలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్లలో 680 సీట్లు, ప్రైవేట్ ఐటీఐ కళాశాల్లో వివిధ ట్రేడ్లలో 944 సీట్లున్నాయి. ఈ విద్యాసంవత్సరం జిల్లాలోని అన్ని కళాశాలల్లో 1624 సీట్లు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 24లోపు దరఖాస్తు పూర్తి చేసుకోవాలి.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేకశిక్షణ

ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కనకారావు



ఐటీఐలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్ మెంట్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం అవసరమైన మెలకువలపై పట్టుసాధించడంతో పాటు కోర్సులు పూర్తికాగానే ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తాం. ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిటర్, టర్నర్, మెకానికల్ డీజిల్ తదితర కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలో ఉద్యోగాలు సాధిస్తున్నారు. కాబట్టి ఐటీఐలో వివిధ ట్రేడుల్లో చేరేందుకు ఆసక్తికలిగినవారంతా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

నూతన క్రీడాపాలసీ క్రీడాకారులకు వరం

● కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ ● నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ స్పోర్ట్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన నూతన క్రీడా పాలసీ వర్ధమాన క్రీడాకారులకు ఒక వరమని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కార్యదర్శి శ్రీకాంత్ మట్లాడుతూ నూతన అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైందని, ఈ అసోసియేషన్ ఎకేఎఫ్ఐ గైడ్ లైన్స్ అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విధంగా కబడ్డీ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామని, కూటమి ప్రభుత్వంలో క్రీడల్లో రాజకీయాలు ఉండవని అన్నారు. తమ అసోసియేషన్‌కు ఎకేఎఫ్ఐ గుర్తింపు, సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో నిబంధనల ప్రకారం మా అసోసియేషన్‌కి మాత్రమే గుర్తింపు, అర్హత ఉన్నాయన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేస్తామని, ఖేలో ఇండియాలో మెడల్ కొట్టిన ప్రతి క్రీడాకారుడికి 5 వేలు బహుమతి అందిచడం జరిగిందని తెలిపారు. గతంలో కొంతమంది కబడ్డీ క్రీడా అసోసియేషన్ పేరుతో వివాదాలు చేశారని, ఇకపై అటువంటి వాటికి ఈ ప్రభుత్వంలో చోటులేదని, త్వరలోనే బీచ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు మణికంఠకు రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యవర్గం ఎన్నికకు ఎకేఎఫ్ఐ అబ్జర్వర్‌గా వీరేష్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలిగా ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణ, కార్యదర్శిగా యలమంచిలి శ్రీకాంత్‌లు ఎన్నికకగా, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకు సన్నద్ధం

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



బస్‌స్టేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం ప్రకటనపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ లీడర్ షిప్ రాష్ట్రంలో మహిళలకు ఎన్నో ఏళ్లుగా సాధికారిత కల్పిస్తూ వారిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకువెళుతుందన్నారు. ఆ దిశగా ముఖ్యమంత్రి మరో గొప్ప చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రం అంతటా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించటం చాలా సంతోషించాల్సిన విషయమన్నారు. ఉచిత బస్సు పథకం రాష్ట్రంలో మహిళలందరికీ ఎంతో మేలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేస్తుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం అందించటం ద్వారా ప్రభుత్వం మహిళల పై ఆర్థిక భారాన్ని తగ్గించటమే కాకుండా, వారి భద్రతను, సౌలభ్యాన్ని, గౌరవాన్ని పెంచుతుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న అచంచలమైన అంకిత భావానికి అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పటానికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒక ఉదాహరణ అన్నారు. ఉచిత బస్సు పథకం రాష్ట్ర వ్యాప్తంగా మహిళల జీవితాల్లో సానుకూల మార్పులను తీసుకువస్తుందని, వారి ఆకాంక్షలను నెరవేరుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ఆగస్టు 15వతేదీ నుంచి ఈ పథకం అమలు చేయటానికి ఆర్టీసీ సర్వసన్నద్ధంగా ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత

● రక్తపోటును అధిగమిద్దాం: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు దోహదమైన యోగాసనాలు, ధ్యానంతో ఒత్తిడిని తట్టుకొని రక్తపోటుని నివారించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రక్తపోటు శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించి రక్తపోటు పరీక్షలను చేయించుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్ల నియంత్రణ, శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతత చేకూర్చే యోగాసనాలు, ధ్యానం చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తపోటును చూపించుకొంటున్న కలెక్టర్ లక్ష్మీశ

మహిళపై అత్యాచారం కేసులో విచారణ చేపట్టిన సీఐ

బంటుమిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారం కేసు విషయంలో సీఐ నాగేంద్రకుమార్ శనివారం బంటుమిల్లిలో విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన మహిళ బంటుమిల్లి కేవీఆర్ కాలనీలోని అమ్మగారింటికి వద్దకు తరచూ వస్తుండేది. బంటుమిల్లికి చెందిన ఇద్దరు అబ్బాయిలు విజయవాడలో తనపై అత్యాచారం చేశారంటూ గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు సీఐ నాగేంద్రకుమార్, బంటుమిల్లి రెవెన్యూ సిబ్బంది పంచనామా నిర్వహించి దర్యాప్తు చేపట్టారు. తరచూగా అబ్బాయిలు ఆ అమ్మాయిని వేధించడంతో తల్లితండ్రుల దృష్టికి వెళ్లగా అసలు విషయం బయటకొచ్చినట్లు తెలుస్తుంది.

మా పిల్లల చదువుల దృష్ట్యా ఏపీకి వచ్చేలా చర్యలు తీసుకోండి

● తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ హోంగార్డులు

గాంధీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీకి చెందిన హోంగార్డులు శనివారం ఒక ప్రకటన ద్వారా కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 11 ఏళ్లుగా సొంత రాష్ట్రానికి రావాలని ఎదురుచూస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగులను వారి స్థానికత ప్రకారం మార్చారని హోంగార్డులను మాత్రం మార్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు ఏపీలో ఉండగా తాము తెలంగాణలో విధులు నిర్వర్తిస్తూ ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు తెలంగాణలో చదువుతున్నారని భవిష్యత్‌లో వారు ఏపీ స్థానికత కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పాఠశాలలు, కాలేజీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో తమ పిల్లల చదువుల కోసం మానవతా దృక్పదంతో ఏపీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేందుకు సుమారు 400 మంది, ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లేదుకు సుమారు 400 మంది హోంగార్డులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఏవీవీఎల్ నారాయణరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధు కోరారు.

పాకిస్థాన్‌తో చర్చలు మావోయిస్టులపై కాల్పులా..!

● మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

గాంధీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి ఎందుకు ఆసక్తి చూపడం లేదని సుప్రంకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ ప్రశ్నించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆదివాసీల భూసమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తే ఈ దేశంలో ఆదివాసీలు తుపాకులు పట్టుకునే అవకాశం ఉండేది కాదన్నారు. మావోయిస్టులు, పోలీసులు ఇద్దరివి ప్రాణాలేనని ఎవరి ప్రాణాలు పోగుడదన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపి ప్రాణ నష్టాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చించేందుకు సిద్ధమన్న మావోయిస్టుల ప్రకటనను స్వాగతించకుండా ఆఖరి మావోయిస్టును చంపేదాక ఆపరేషన్ కగార్ ఆగదని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరైందికాదన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఏపీపీస్ కమిటీ నేత పిచ్చుక శ్రీనివాస్, పౌరమక్కుల సంఘం నేతలు టి.ఆంజనేయులు, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ పాల్గొన్నారు.

నగరానికి అంతర్జాతీయ విమాన సర్వీసులు

● ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు

విజయవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపారం, పర్యాటక రంగంలో గణనీయంగా వృద్ధి చెందిందని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో మూడు ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలకు అంతర్జాతీయ విమానాలను అనుసంధానం చేయాలని కేంద్ర విమానయానశాఖ మంత్రికి లేఖలో ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పెద్ద విమానాల నిర్వహణ చేయడానికి తగిన మౌలిక సదుపాయాలున్నప్పటికీ డైరెక్ట్ కనెక్టవిటీ లేదన్నారు. రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం కావడంతో విద్య, ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా ఎదుగుతోందని, దీంతో విజయవాడ కేంద్రంగా విమాన ప్రయాణాలు పెరుగుతున్నాయన్నారు. దుబాయ్ అనేక అంతర్జాతీయ గమ్యస్థానాలకు అనుసంధానంగా ఉన్నందున విజయవాడ నుంచి దుబాయ్, సింగపూర్‌కు డైరెక్ట్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని ఏపీ ఛాంబర్స్ కొన్నేళ్లుగా కోరుతోందని మంత్రికి ఈ లేఖ ద్వారా తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానశ్రయాలకు అంతర్జాతీయ విమానాలను అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పొట్లూరి భాస్కరరావు కోరారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535	

గరికపర్రులో మినీ మహానాడు నేడు

తోట్లవల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రు సాయి కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు టీడీపీ మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ తెలిపారు. పెనమకూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడుకు ముందుగా గరికపర్రులో మినీ మహానాడు నిర్వహించే అవకాశం లభించటం అందరికీ గర్వకారణమన్నారు. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు మినీ మహానాడుకు హాజరవు తారన్నారు. పామర్రు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు మినీ మహానాడుకు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని శివరామ్‌ప్రసాద్ కోరారు.



బాధితులకు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

బాధిత కుటుంబాలకు తక్షణం సీఎం సాయం

గుడివాడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి 11 నెలల పాలనలో పేద, బడుగు, బలహీనవర్గాలకు మెరుగైన వైద్యం అందిస్తూ, సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 కోట్లు సాయం అందించామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు రూ.30 లక్షల సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెనిగండ్ల శనివారం అందజేశారు. అందించారు. దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజుల్లోనే చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధిత కుటుంబాలకు భరోసా కల్పించి సహాయం అందించేలా ప్రజావేదికలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన షేక్ సలీమా, గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు చెందిన కూర్మా నాగరాజు, మేడం పండుబాబు, కౌతవరానికి చెందిన ఆర్.నరసింహారావు, నందివాడ మండలం పెదలింగాలకు చెందిన గండికోట అచ్చమ్మ కుటుంబాలు సిఫార్సు లేఖలు అందుకున్నారు. నాయకులు రాంబాబు, దానేటి సన్యాసిరావు, పంద్రాజు సాంబశివరావు, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

హెచ్‌ఐవీపై కళాజాతా ప్రదర్శన

గుడివాడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరురోడ్డులోని ఆర్‌కె కాంప్లెక్స్ వద్ద యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బిళ్లపాడు కళాకారుల బృందం హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఉత్తర్వుల మేరకు హెచ్‌ఐవీ నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ఐసీటీసీ సెంటర్లు, ఏఆర్‌టీ మందులు తదితర అంశాలపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



వైభవంగా ఉర్సు మహోత్సవాలు

గుడివాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం గ్రామంలో వేంచేసియున్న సయ్యద్ సాలార్‌షా ఔలియా ఖాదరీ ఉర్సు మహోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. భక్తులు నజరే నియాజ్ (మొక్కుబడులు) చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఖవ్వాలి ఆకట్టుకుంది. కర్ణాటకకు చెందిన ఫాతిమ్ అతీష్, బెల్గాంకు చెందిన రోష్నీ వార్సి పాడిన ఖవ్వాలి పాటలు ప్రేక్షకులను కట్టిపడేసాయి. తెలుగులో అమ్మ గొప్పతనం గురించి పాడిన పాట కంటతడి పెట్టించింది. సుమారు 75 ఏళ్లుగా ఉర్సు మహోత్సవాలను భక్తుల విరాళాలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ముజావర్ యాకూబ్ బేగ్ తెలిపారు.



మోటూరు పీహెచ్‌సీకి ఏసీలు అందజేసిన ఘంటా వెంకట రామానుజరావు

మోటూరు పీహెచ్‌సీకి రెండు ఏసీల వితరణ

గుడివాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన స్థల దాత, మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ ఘంటా కృష్ణమూర్తి మనుమడు ఘంటా రామానుజరావు రెండు ఓల్టాస్ ఏసీలు విరాళంగా అందజేశారు. మోటూరు పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి, తేజలకు శనివారం ఆయన అందజేశారు. మోటూరు పీహెచ్‌సీకి 80 లీటర్ల కూలర్‌ను కూడా వితరణగా అందించారు.



ప్రమాదంలో మరణించిన ఊటుకూరి దుర్గ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెబుతున్న కుమార్‌రాజా

బాధిత ఆశా వర్కర్ల కుటుంబాలకు ఎమ్మెల్యే కుమార్ రాజా పరామర్శ

పమిడిముక్కల, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన తాడంకి, గోపువానిపాలెం, మర్రివాడ గ్రామాలకు చెందిన ఆశావర్కర్ల కుటుంబాలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. తాడంకి గ్రామానికి చెందిన ఊటుకూరి దుర్గ కుటుంబ సభ్యులను కలుసుకుని ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. గాయపడిన మాగంటి సుజాతను పరామర్శించారు. గోపువానిపాలెంలో మృతురాలు విజయలక్ష్మి, మర్రివాడలో గాయపడిన ఆశావర్ల కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, కూటమి నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



గుడివాడలో 300 అడుగుల జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీలో పాల్గొన్న నేతలు



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బీజేపీ, జనసేన నేతలు

భారత్ సత్తా చాటిన సిందూర్

● గుడివాడ తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల కుట్రలు, ఆరాచకాలను ఐక్యతతో తిప్పికొట్టి భారత్ సత్తాను ప్రపంచానికి చాటారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను కీర్తిస్తూ గుడివాడలో శనివారం భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు.

మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన యాత్ర మార్కెట్ సెంటర్, వాసవి చౌక్, ఏజీకే స్కూల్ సెంటర్, నెహ్రూచౌక్ నుంచి తిరిగి మున్సిపల్ కార్యాలయం వరకు 300 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ విజయోత్సవం స్ఫూర్తి తో గుడివాడలో వేలాది మందితో తిరంగా ర్యాలీ నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే ముష్కరుల కుట్రలను దేశ ప్రజలు ఐక్యతతో తిప్పికొట్టారన్నారు. ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పడంలో త్రివిధ దళాల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. భారత సైన్యం దెబ్బకు పాకిస్థాన్ ప్రపంచ దేశాలను బతిమలాడుకుని కాళ్ల బేరానికి వచ్చిందన్నారు. భారత్ సాంకేతిక సత్తా ఏమిటో ప్రపంచానికి మరోసారి తెలిసిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, త్రివిధ దళాలకు దేశ ప్రజలు అన్నివేళలా మద్దతుగా ఉంటారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఎస్పీ ధీరజ్ వినీల్, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మాట్లాడుతూ ఐక్యతను చాటేలా గుడివాడలో తిరంగా ర్యాలీలో వేలాది మంది పాల్గొనడం అభినందనీయమన్నారు. అమర జవాన్‌ల పోరాటం, త్యాగాలను దేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోరని అన్నారు. భారత త్రివిధ దళాలకు యావత్ దేశప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, ఎన్టీఆర్ స్టేడి యం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రదాడులను తీవ్రం గా పరిగణించిన భారత్ దాయాది పాకిస్తాన్‌కు తిరుగులేని గుణపాఠం నేర్పిందన్నారు. జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకులు పిన్నమనేని బాబ్జీ, సత్యనారాయణ, లింగం ప్రసాద్, పంద్రాజు సాంబశివరావు, మురళీ, దానేటి సన్యాసిరావు, తహల్దార్ వి.రామకోటేశ్వరరావు, మున్సిపల్, రెవెన్యూ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మాజీ సైనికాధికారులు, జవాన్లు, కూటమి పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

గుడివాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ అన్నారు. స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బీట్ ద హిట్ పేరుతో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ ఆవరణలో మొక్కను నాటారు. జడ్పీ సీఈవో ఆనంద్ కుమార్ డెంగ్యూ వ్యాధి లక్షణాలు, డెంగ్యూ దోమ బా రిన పడకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలు వివరించారు. డ్వామా పీడీ శివ ప్రసాద్ మాట్లాడుతూ వేతన శ్రామికులు 10 గంటల లోపే పనులు ముగించుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ కూరగంటి పద్మ, డాక్టర్ నిరీక్షణ, ఎంపీడీవో విష్ణు ప్రసాద్, శ్రీనివాస్, డాక్టర్లు ప్రీతి, తేజ, మహేష్, హిమబిందు, కార్యదర్శి కోటయ్య, ఉపాధి హామీ శ్రామికులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న డీహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ



వడ్లమన్నాడులో నీటి తొట్టెను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

గుడ్లవల్లేరు : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం గుడ్లవల్లేరు, వడ్లమన్నాడు గ్రామాల్లో నిర్వహించారు. గుడ్లవల్లేరులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రాంభించారు. మొక్కలు నాటారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. వడ్లమన్నాడులో చలివేంద్రం ప్రారంభించారు వైద్య శిబిరాలను నిర్వహించారు. పశువుల దప్పిక తీర్చేందుకు తొట్టెను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో టి.విజయసారధి, గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, వడ్లమన్నాడు కార్యదర్శి వెంకటరమణ, రమేష్, గరికపాటి రాంబాబు, తోట చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం

గుడివాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర - స్వరాంధ్ర కార్యక్రమం గుడివాడ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగింది. కార్యాలయాన్ని, గోడలను పరిశుభ్రం చేశారు. స్వచ్ఛాంధ్ర పేరిట మానవహారం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తహసీల్దార్ రంగారావు వివరించారు. ఆర్‌ఐ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.



టీడీపీ కౌతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బాబూరావు తదితరులను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కౌతవరం, గుడ్లవల్లేరు, ఉలవలపూడి, వడ్లమన్నాడు టీడీపీ గ్రామ కమిటీలు ఏకగ్రీవం

గుడ్లవల్లేరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవస్థాగత ఎన్నికల్లో భాగంగా శనివారం కౌతవరం టీడీపీ కమిటీని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడి వి.బి.కె.వి సుబ్బారావు (బాబూరావు), ఉపాధ్యక్షుడిగా భూపతి రవికాంత్, కార్యదర్శిగా చిట్టిబొమ్మ సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉలవలపూడి గ్రామ పార్టీ అధ్యక్షునిగా పామర్తి రామయ్య, ఉపాధ్యక్షునిగా జంగం వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎండి.మునీర్‌బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుడ్లవల్లేరు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా వల్లభనేని రంగారావు, ఉపాధ్యక్షుడిగా తుమ్మపూడి చంద్రశేఖర్ (నాని), ప్రధాన కార్యదర్శి పోలగాని సతీష్, సంయుక్త కార్యదర్శిగా జి.వి.వి.ఎస్.ఎల్ ప్రసాద్, కోశాధికారిగా సనకా వెంకట్రామయ్య(నాని), వడ్లమన్నాడు గ్రామ పార్టీ అధ్యక్షుడి పామర్తి సత్తిబాబు, ఉపాధ్యక్షుడిగా నత్తా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తోట రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెరువుకు అనుమతులివ్వొద్దంటూ ధర్నా

గుడ్లవల్లేరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో 50 ఎకరాల చేపల చెరువు తవ్వడానికి అనుమతులు మంజూరు చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని చెరువు తవ్వకాల వ్యతిరేక ఉద్యమ కమిటీ నాయకుడు మామిడి బాబూరావు, దావులూరి అజయ్‌కర్ హెచ్చరించారు. అంగలూరులో చెరువుల తవ్వకానికి వ్యతిరేకంగా శనివారం ధర్నా నిర్వహించారు. దాచే నరసింహ, చిర్ల శ్రీకర్, మేడేపల్లి శ్యామ్,ఎలికె అభిషేక్, చేబ్రోలు ఆనంద్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



పమిడిముక్కల, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈసెట్‌లో ఆరో ర్యాంకు సాధించిన చోరగుడికి మేకా మహేష్, పదవ తరగతి పరీక్షల్లో 566 మార్కులు సాధించిన జడ్పీ పాఠశాల విద్యార్థిని మీర్జా హేనా జహేరాలను చోరగుడి సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, గ్రామ ప్రముఖులు సుబ్రమణ్యేశ్వరరావు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి టీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పామర్రు, మే 17 (ఆంధ్రజ్యోతి) : గుంతల రోడ్లు .. తప్పని పాట్లుఅంటు శనివారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. మేఘా ఇంజనీరింగ్ సంస్థ గ్రామంలోని పెద్ద పెద్ద గోతులను గ్రావెల్‌తో పూడ్చి రోడ్లకు మరమ్మతులు చేసింది. రహదారికి మరమ్మతులు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించడంలో సహాయపడిన ఆంధ్రజ్యోతికి, మేఘా ఇంజనీరింగ్ సంస్థ అధికారులకు గ్రామ ప్రముఖుడు వీరమాచినేని వేంకటేశ్వరరావు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పమిడిముక్కలలో బీట్ ద హీట్

పమిడిముక్కల, మే 17 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు అన్నారు. బీట్‌ద హీట్ కార్యక్రమంలో భాగంగా శనివారం పమిడిముక్కల పంచాయతీ కార్యాలయం వద్ద వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. సర్పంచ్ ముళ్లపూడి సునీతతో కలసి చలివేంద్రం ప్రారంభించారు. ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం విజయభాను

పామర్రు, మే 17 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశనుంచే బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పామర్రు-శివ గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం విజయభాను సూచించారు. చాట్లవానిపురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారాన్ని సూచించారు. ఎమ్మెస్ కే కె.విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. అంగన్వాడీ కేంద్రం నిర్వాహకురాలు చాట్ల సుజాత, ఎస్.శ్రీదేవి, నాంచారమ్మ, ప్రేమలత, ఆశా కార్యకర్తలు సుకన్య, ప్రియాంక, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కూచిపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి) : పెదసనగల్లులో లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, పంచగవ్య ప్రాశన, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ, విశేష పూజలు నిర్వహించారు.

పచ్చిరొట్ట ఎరువులే మేలు

గుడివాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు ఏవో బోలెం అనంతలక్ష్మి తెలిపారు. దొండపాడు, మోటూరు రైతు సేవా కేంద్రాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. దొండపాడులో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. పచ్చి రొట్ట ఎరువుల వల్ల చాలా లాభాలు ఉంటాయన్నారు. వీఏఏలు నాగరాజు, భవాని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535



రైలుకింద పడి కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య

పెడన, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామలక్ష్మీ వీవర్స్ కాలనీకి చెందిన కేబుల్ ఆపరేటర్ సింహాద్రి రమేష్ (52) శనివారం తెల్లవారుజామున రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గుడివాడ నుంచి మచిలీపట్నం వెళుతున్న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌కు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పశువుల ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ నరసింహులు



కోన గ్రామంలో వీధులను శుభ్రం చేస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరాలయం పరిసరాలను శుభ్రం చేసి దేవస్థానం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

స్వచ్ఛత సంస్కృతిలో భాగం కావాలి

• స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో వక్తల ఉద్ఘాటన

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత మన సంస్కృతిలో భాగం కావాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్‌సీహెచ్ నరసింహులు అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పశువుల ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేవారు. పిచ్చి మొక్కలను పీకేశారు. పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. నరసింహులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత తో పాటు మొక్కలు పెంచుతూ పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలన్నారు.

45వ డివిజన్ టీడీపీ నాయకుడు పివి ఫణికుమార్ మాట్లాడుతూ, బందరుకు పోర్టు వస్తున్న దృష్ట్యా కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయ అడ్మిన్ షేక్ అల్లాభక్షు, మానస. బి.వి.రామశేఖర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. కాగా బందరు మండలం కానూరు గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ స్వయంగా చీపురు పట్టి ఊడ్చారు. ఉద్యోగులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకం వీడాలని, చెత్తను డస్ట్‌బిన్‌లో వేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, పీతా రాము, బొమ్మిడి ఏడుకొండలు, కొండలరావు, నాని, రాజేష్, బోట్ల సాయి, చిన్నా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రుద్రవరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

బందరు మండలం రుద్రవరం గ్రామంలో శని వారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు నీలం రమేష్, కంచర్ల గణేష్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మునిసిపల్ అధికారులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు, ఏఎన్ఎంలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

నీటిని వృథా చేయొద్దు : వీసీ

ప్రకృతి ప్రసాదించిన నీటిని వృథా చేయవద్దని, మొక్కల పెరుగుదలకు ఉపయోగించాలని కృష్ణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ అన్నా రు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీరు పోశారు. లెక్చరర్లు, విద్యార్థులు విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని శుభ్రం చేవారు. .రాజీ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పదివేల మొక్కలు నాటుతామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న వీసీ రాంజీ

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం కావాలి

మోపిదేవి : పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి విధి నిర్వహణ చేయాలని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శుభ్రం చేసి ఉద్యోగులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారిస్తామని దేవాలయ ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు, సత్యనారాయణ, ఉద్యోగులు ఉన్నారు.



పులిగడ్డలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలతో స్వచ్ఛాంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వార్డు సభ్యులు మండలి విజయలక్ష్మి, చెన్ను రమేష్, చెన్న బాబురావు, వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. చౌరస్తాలో 200 మందికి మజ్జిగ పంపిణీ చేశారు.

బంటుమిల్లిలో ..



బంటుమిల్లి : వెంట్రప్రగడ కృష్ణవేణి ఆధ్వర్యం లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. మొక్కలు నాటారు. చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పవన్‌కుమార్, సెక్రటరీ ఝాన్సీ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పెడన తిరంగా ర్యాలీలో పాల్గొని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

భారత్ సత్తా చాటిన ఆపరేషన్ సిందూర్

పెడన, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని కీర్తిస్తూ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తొలుత బస్టాండ్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి తిరంగా ర్యాలీని ప్రారంభించారు.

ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జనసేన నియోజకవర్గ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కమిషనర్ ఎం. గోపాలరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు త్రివర్ణ పతాకాలను చేతబూని భారత్‌మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు.

మహాత్మాగాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన సభలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, అభివృద్ధిపథంలో దూసుకుపోతున్న భారతదేశాన్ని చూసి ఓర్వలేని పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రధాని మోదీ ప్రపంచానికి మన సత్తా ఏమిటో చూపించారని ఎమ్మెల్యే ప్రశంసించారు. వీరమరణం పొందిన మురళీనాయక్‌కు సంతాపసూచకంగా సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.



సీనియర్ ఖాతాదారులను సన్మానిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం సుబ్రహ్మణ్యం

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

• ఎస్‌బీఐ లక్ష్మీపురం బ్రాంచి 50వ వార్షికోత్సవంలో ఎస్‌బీఐ ఆర్ఎం

చల్లపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజినల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌బీఐ లక్ష్మీపురం శాఖ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఖాతాదారుల సేవలో లక్ష్మీపురం శాఖ 50 సంవత్సరాలు పూర్తిచేసుకోవటం సంతోషంగా ఉం దన్నారు. బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారుల సంయుక్త సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. సీనియర్ ఖాతాదారులు మిక్కిలినేని పాపారావు, విశ్రాంత మాస్టారులను సన్మానించారు. బీఎం వి.భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్, గురుసంతోష్, ఏసుపాదం, మురళిలతోపాటు ఖాతాదారులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ఘంటసాల, మే 17 (ఆంధ్రజ్యోతి): వి.రుద్రవరం గ్రామానికి చెందిన వీర్ల నాగరాజు రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నాగాయలంకకు చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు చెన్ను రంగారావు రూ.5500 ఆర్థిక సాయంగా అందజేశారు. సాయమందించిన చెన్ను రంగారావుకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.



రీ-సర్వేపై అభ్యంతరాలుంటే తెలియజేయండి

ఘంటసాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : వేములపల్లి గ్రామంలో జరిగిన రీ సర్వేలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ పేర్కొన్నారు. ఐదు నెలలుగా వేములపల్లి గ్రామం లో జరిగిన రీ సర్వేపై శనివారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన 712 ఎల్‌పి నెంబర్లకు గానూ 613 ఎకరాల ముప్పై రెండున్న సెంట్లకు సంబంధించి సర్వే వివరాలను ప్రచురించామన్నారు. సర్వేలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే డీటీ శ్రీనివాస్ సర్వే జరిపిన విధానాన్ని వివరించారు. గ్రామానికి చెందిన సూర్యదేవర అరుణ తన భూమికి సంబంధించి కొంత తగ్గిందని, మరలా సర్వే చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వో మనీషా, విలేజ్ సర్వేయర్ మానసదేవి పాల్గొన్నారు.

రైతులకు సేవ చేసే అదృష్టం : రామకృష్ణ



మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ పదవి కూటమి ప్రభుత్వం తనకు ఇవ్వడంతో రైతులకు సేవ చేసే అదృష్టం కలిగిందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. శనివారం బండి రామకృష్ణను ఆయన నివాసంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, కొండా, కోటి, మైకేల్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరి చిన్నాకు రోశయ్య స్మారక అవార్డు



పెడన, మే 17 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు, నిర్భాగ్యులకు సేవలందించడం ద్వారా ఇప్పటికే పలు అవార్డులు, సత్కారాలు అందుకున్న ఆర్యవైశ్య ప్రముఖుడు, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా తాజాగా మరో అవార్డుకు ఎంపికయ్యారు. చిన్నా సేవలను గుర్తించిన విశాఖపట్టణానికి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఆయనను కొణిజేటి రోశయ్య మెమోరియల్ అవార్డుకు ఎం పిక చేసింది. ఈనెల 20న విశాఖ జిల్లా పౌర గ్రంథాలయంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చిన్నా ఈ పురస్కారం అందుకుంటారు.

పెడన సీఐటీయూ కార్యవర్గం

పెడన, మే 17 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ సంస్థ) కార్యవర్గం ఎన్నికయింది. అధ్యక్షుడిగా కైలా జ్ఞానప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బంగారు రవిప్రసాద్, కార్యదర్శిగా బంగారు నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఏలేటి ఏసు, కోశాధికారిగా నాదెండ్ల శేషుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ నాయకులు బూర సుబ్రహ్మణ్యం, జయరామ్, పంచల నరసింహారావు పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది.



మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు. చిలకలపూడిలో మహిళల స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ రుణాలు పొంది వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలన్నారు.

భూసార పరీక్షలకనుగుణంగా ఎరువులు వాడాలి

పెడన రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షలకనుగుణంగా ఎరువుల వాడకం ఉండాలని మండల వ్యవసాయాధికారి నూరున్నీసా అన్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. భూములు సారవంతమయ్యేందుకు ముందుగా పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు జల్లి వాటిని దుక్కిలో దున్నాలన్నారు. 1300కు పైగా భూసార పరీక్షలు నిర్వహించామని వాటి ఫలితాలను త్వరలో రైతులకు అందిస్తామన్నారు.

కొక్కిలిగడ్డకు కనపర్తి, గోవర్ధన్ పరామర్శ

నాగాయలంక, మే 17 (ఆంధ్రజ్యోతి) : చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న సొర్లగొంది మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సీనియర్ టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావును టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ శనివారం స్వగృహంలో పరామర్శించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్‌లతోపాటు మత్స్యకార నేతలు పరామర్శించారు. కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న గణపేశ్వరం నేత గుంటూరు జైపాల్‌ను పరామర్శించారు.



పూర్వ విద్యార్థి బెంచీల వితరణ

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎన్ గొల్లపాలెం ఎంపీయూపీ పాఠశాల ఉన్నత పాఠశాలగా రూపొందుతున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థి సూదగాని నరసింహారావు పాఠశాలకు 20 బెంచీలు బహూకరించారు. హెచ్ఎం జి. శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎల్. కుసుమ కుమారి, ఎస్. రామకృష్ణ, మధు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

మోపిదేవి, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీ రాణి అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ శనివారం ఆమె ప్రారంభించారు. యూనిట్ ధర రూ.1110 ఉండగా, 50 శాతం రాయితీపై రైతులకు రూ.555లకు దాణా అందిస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారి గుల్‌జాల్ బేగం, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, బొందలపాటి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర పరీక్షలు

చల్లపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. నర్రా రమాదేవి జ్ఞాపకార్థం భర్త, లయన్ నర్రా సాయిబాబు సహకారంతో జరిగిన శిబిరంలో డాక్టర్ వెంకటరావు 50 మంది రోగులను పరీక్షించి 12 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. క్లబ్ ప్రతినిధులు కస్తూరి ప్రసాద్, మోపిదేవి వెంకటేశ్వరరావు, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, ఎంవి.కృష్ణారావు, వేమూరి మురళీకృష్ణ, కె.సుధాకర్, ఉప్పల సాంబశివరావు, అంబటి బసవశంకరరావు పర్యవేక్షించారు.

హజ్‌యాత్రకు రహమాన్ బేగ్



పెడన, మే 17 (ఆంధ్రజ్యోతి) : హజ్ యాత్రకు వెళ్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు, పెడన మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ రహమాన్‌బేగ్‌కు అభిమానులు, పార్టీ శ్రేణులు ఘనంగా వీడ్కోలు పలికారు. రహమాన్ బేగ్ శనివారం సాయంత్రం ఐదో వార్డులోని తన నివాసం నుంచి వందలాది మందితో ఊరేగింపుగా హజ్ యాత్రకు బయలుదేరారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కూటమి నాయకులు, ముస్లిం ప్రముఖులు ఘనంగా వీడ్కోలు పలికారు.

మినీ మహానాడు జయప్రదం చేయండి : గోవర్ధన్



అవనిగడ్డ, మే 17 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలో ఈ నెల 19వ తేదీన జరుగనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని పారిశ్రామిక వేత్త, టీడీపీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోపిదేవిలో నిర్వహించే మినీ మహానాడు జయప్రదం చేయాలన్నారు. వైసీపీ అరాచకాలపై ఐదేళ్లు ఎదురొడ్డి పోరాడిన పోరాట స్ఫూర్తికి మహానాడు వేదిక కావాలని, నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలు మహానాడు ద్వారా పార్టీకి తెలపాలని సూచించారు. మినీ మహానాడుకు ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు హాజరవుతారన్నారు.

ఉద్యోగుల చలో విజయవాడ 5న

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలపై జూన్ 5న విజయవాడలో జరిగే సమావేశానికి చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి. రాము పిలుపునిచ్చారు. శనివారం డీఈవో కార్యాలయం వద్ద సంఘం నాయకులు చలో విజయవాడ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి తోట ప్రసాద్, కోశాధికారి సురేష్‌నాయక్, జి. శ్రీనివాస్, సిహెచ్ఎస్ఆర్ పవన్‌కుమార్, రామప్రసాద్, బాలాజీ, లోకేష్, పరమేశ్వరరావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాంచారమ్మ తల్లిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న గ్రామస్థులు

నాంచారమ్మ ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

మోపిదేవి, మే 17 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లిలో నాంచారమ్మ ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, జలాధివాసం, ప్రధాన కుంభవాహన, అఖండ దీపారాధన, ప్రసాద వితరణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు పుల్లేటికుర్తి గౌరి శంకర్ కుమార్ ఆధ్వర్యంలో 11 మంది రుత్వికుల బృందం ప్రతిష్ఠా పూజలు నిర్వహించారు. ఈ నెల 21వ తేదీన నాంచారమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.